بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 22.03.2019 (Telugu)**

# 23 మార్చి తేదీ మసీహ్ మౌవూద్ దినోత్సముగా జమాఅత్‌లో గుర్తింపు పొందినది. ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి చేసిన వాగ్దత్త మసీహ్, ఈ కాలపు మహ్దీ తానేనని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం ప్రకటించి బైఅత్ పర్వమును ప్రారంభించిరి

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 22.03.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి. రేపు 23 మార్చి రోజు. ఈ రోజు మసీహ్ మౌవూద్ దినోత్సముగా జమాఅత్‌లో గుర్తింపు పొందినది. ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి చేసిన వాగ్దత్త మసీహ్, ఈ కాలపు మహ్దీ తానేనని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం ప్రకటించి బైఅత్ పర్వమును ప్రారంభించిరి. మసీహ్ మౌవూద్ అవతరణ అవసరము, ఈ కాలపు స్థితిగతులు, తమ ప్రకటన గురించి వివరించిన విసయములను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కొన్ని పంక్తులలోనే నేనిప్పుడు ప్రస్తావింతును.

మునుగుచున్న ఇస్లాం నావను రక్షించుటకు ఎవరో ఒకరు అవతరించాలని ఈ కాలము ఆశించుచుండెను. కాని అధిక ముస్లిం విద్యావంతులు గతములో మసీహ్ అవతరణ కొరకు నిరీక్షించుచుండినను దురదృష్టవశాత్తు వారు ప్రకటించిన తర్వాత అధికులు వ్యతిరేకించిరి. అమాయక ముస్లిములకు అసత్య కథలు వినిపించి వారికి, వారి జమాఅత్‌నకు విరుద్ధంగా ప్రజలను ఎంతగా రెచ్చగొట్టినారనగా వారిని హత్య చేయుటకు ఫత్వాలు (ధార్మిక తీర్పులు) వెల్లడించిరి. నేటి వరకు ఇస్లాం మాటున అహ్మదీయులను తీవ్ర భయంకరమైన విధంగా హింస, దౌర్జన్యమునకు గురిచేయుచున్నారు. ఇస్లాం వాస్తవము తెలిసిన వారు వీటిని ఎన్నడు ఊహించనే లేరు, వారిచే ఇటువంటి పనులు సంభవించనే సంభవించవు. మసీహ్ రావలసిన అవసరమేముండెనని, ఈ కాలముతో మసీహ్‌కు గల సంబంధమేమిటని తెలుపుచు వారిట్లనిరి. ఇస్రాయీలీ, ఇస్మాయీలీ పరంపరలలో ఖిలాఫత్ విషయమును పవిత్ర ఖుర్ఆన్ స్పష్టంగా పోల్చినది. ఉదా॥ ఈ సూక్తిని గమనించగలరు.

وَعَدَ اللّٰهُ الَّذِيۡنَ اٰمَنُوۡا مِنۡكُمۡ وَعَمِلُوا الصّٰلِحٰتِ لَيَسۡتَخۡلِفَنَّهُمۡ فِى الۡاَرۡضِ كَمَا اسۡتَخۡلَفَ الَّذِيۡنَ مِنۡ قَبۡلِهِمۡ

(అన్నూర్:56) వారిట్లనిరి. ఇస్రాయీలీ చివరి ఖలీఫా (ఉత్తరాధికారి) అనగా మసీహ్ నాస్రీ హజ్రత్ మూసా అలైహిస్సలాం తర్వాత 14వ శతాబ్దములో అవతరించెను. కావున అదే విధంగా ఈ సమాజములో కూడ 14వ శతాబ్దములోనే మసీహ్ అవతరించవలసి యుండెను. ఇంతే కాక దైవ స్వప్నములు తిలకించే వారు ఈ శతాబ్దమును మసీహ్ అవతరణ శతాబ్దముగా అభివర్ణించిరి. ఉదా॥ హజ్రత్ షాహ్ వలియుల్లాహ్ మొ॥, అహ్లె హదీస్ వారందరు చిన్న లక్షణములు పూర్తి అయినవి, పెద్ద పెద్ద లక్షణములు కూడ పాక్షికంగా పూర్తి అయినవని ఏకగ్రీవంగా ఒప్పుకొనిరి. ఏది ఏమైనప్పటికి వారిట్లనిరి. మసీహ్ అవతరణ గురించి లక్షణములన్ని రాబోవు మసీహ్ మౌవూద్ లక్షణములను తెలుపుచు వారిట్లనిరి. రాబోవు మసీహ్ ఒక చిహ్నమేమనగా అతని కాలములో రమజాన్ మాసములో సూర్య చంద్ర గ్రహణము ఏర్పడును. అతని ప్రకటన తర్వాత ఈ సూర్య చంద్ర గ్రహణము ఏర్పడుట అతను అసత్యుడు, మోసగాడు కాదని నిరూపించుచున్నది. ఇంతకు ముందెన్నడు ఇలా సూర్య చంద్ర గ్రహణము ఏర్పడలేదు. ఇదొక సంకేతము. దీని ద్వారా అవతారుని రాకను అల్లాహ్ తఆలా ప్రకటించెను. అరబ్బులు ఈ సంకేతమును తిలకించి తమ అవగాహన ప్రకారము ఇది సరైనదే అని తెలిపిరి. మా కరపత్రములు చేరని ప్రతి చోట సూర్య చంద్ర గ్రహణము అవతారుని రాకను ప్రకటించెను. మానవ ప్రణాళికలకతీతమైన దైవ సంకేతమిది. ఈ మహ్దీ

వరకు ఇటువంటి సంఘటన జరగలేదని రసూలె అక్రమ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ తెలిపిరి. ఇందుకు విరుద్ధంగా చరిత్రానుసారము ఎవరైనా నిరూపించినచో మేము ఒప్పుకొందుము.

వారిట్లనిరి. ఆ కాలములో తోక చుక్క వెలువడునని మరొక సంకేతముండెను. అనగా మసీహ్ నాస్రి హయాంలో ఈ చుక్క ఉదయించెను. ఇప్పుడా చుక్క కూడ ఉదయించినది. పవిత్ర ఖుర్ఆన్‌ను చూడగా మనకిట్లు తెలియును.

وَإِذَا الْعِشَارُ عُطِّلَتْ○وَإِذَا الْوُحُوشُ حُشِرَتْ○وَإِذَا الْبِحَارُ سُجِّرَتْ○وَإِذَا النُّفُوسُ زُوِّجَتْ ○
وَإِذَا الْمَوْءُدَةُ سُئِلَتْ○بِأَيِّ ذَنْبٍ قُتِلَتْ○وَإِذَا الصُّحُفُ نُشِرَتْ

(అత్తక్వీర్:)

ఇవన్ని పవిత్ర ఖుర్ఆన్‌లో గల భవిష్యవాణీలు. దీని విశ్లేషణ ఏమనగా జంతు ప్రదర్శన శాల ఏర్పాటైనవి. విద్య సర్వసాధారణమై ప్రపంచములో వ్యాపించినది. కొన్ని జాతులు కొందరు స్థానికులపై దాడులు చేసి వారిని అంతము చేసిరి. సముద్రములు కూడ కలిపివేయబడునని ప్రస్తావన గలదు. ప్రజలు కూడ కలుపబడుదురని ప్రస్తావన గలదు. అప్పుడు స్త్రీ హింసకు గురగును. ఏ పాపము వలన నన్ను హత్య చేయుచున్నారని ఆమె ప్రశ్నించును. పుస్తకములు ప్రచురించబడును. ప్రెస్, మీడియా వంటి వస్తువులన్ని ఈ కాలము మసీహ్ మౌవూద్ కాలమని నిరూపించుచున్నవి. పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ భవిష్యవాణీలు గలవు.

మరికొన్ని సంకేతముల గురించి వారిట్లనిరి. వివిధ రకాల ఆపదలు సంభవించును. వైపరీత్యాలు ఏర్పడును. ఆకాశ వైపరీత్యాలు అనగా కరువు, మహమ్మారి, తీవ్ర వ్యాధి రూపంలో వెలువడును. మహమ్మారి ఎంతటి భయంకరమైన వ్యాధి అనగా అది ప్రభుత్వమును కూడ అతలాకుతలం చేసెను. భీకర వినాశమును సృష్టించెను. అవతార పురుషుడు తనకు మద్దతుగా ఆకాశ సంకేతములు చూపుట కూడ అనివార్యము. కావున లేఖ్రామ్ సంకేతము ఏదో సాధారణ సంకేతము కానే కాదు. ఒక పోరుగా అనేక సంవత్సరాల వరకు కొనసాగెను. చెప్పిన విధంగా ఆ సంఘటన సంభవించెను. దీనికి ఏదైనా ఉదాహరణ చూపగలరా! సర్వ ధర్మ సమ్మేళనం గురించి కూడ చాలా రోజుల క్రితమే మా వ్యాసముగా ఉత్తమ వ్యాసముగా నిలుచునని మా అల్లాహ్ తఆలా మాకు సమాచారము అందించెనని తెలిపినట్లు ప్రకటించిరి. ఆ మహా గొప్ప, వైభవమైన సమావేశమును తిలకించిన వారు ఇటువంటి సమావేశములో విజయము సాధించునని ముందే చెప్పుట ఒక అపోహ లేదా ఊహ కాజాలదని గ్రహించవచ్చును. తుదకు చెప్పిన విధంగానే జరిగెను. ఇతరులు కూడ ఇది ఉత్తమంగా నిలిచెనని అంగీకరించిరి.

తాను అవతార పురుషుడనని సాక్ష్యములు తెలుపుచు వారింకా ఇట్లనిరి. నేనిప్పుడు అవతార పురుషుడనని తెలుపుటకు అనేక సాక్ష్యములు గలవు. ఒకటి అంతర సాక్ష్యములు. రెండవది బాహ్య ఆధారములు. మూడవది శతాబ్దపు చివరలో అవతరించు సంస్కర్త గురించి సరియైన హదీసు. నాలుగవది انا نحن نزلنا الذکر وانا لہ لحافظون రక్షణ వాగ్దానము. ఇప్పుడు గొప్ప వైభవము గల ఐదవ సంకేతము నూర్ అధ్యాయములో గల ఖిలాఫత్ వాగ్దానము. ఇంతకు ముందే చెప్పినట్లు ఇందులో అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను.

وَعَدَ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا مِنْكُمْ وَعَمِلُوا الصّٰلِحٰتِ لَيَسْتَخْلِفَنَّهُمْ فِي الْاَرْضِ كَمَا اسْتَخْلَفَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ

ఈ సూక్తిలో ఖిలాఫత్ వాగ్దానము ప్రకారము ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజములో అవతరించే ఖలీఫాలు గత పక్షముల ఖలీపాలుగా యుందురు. ఇదే విధంగా పవిత్ర ఖుర్ఆన్‌లో ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను మూసాతో పోల్చుచు అల్లాహ్ తఆలా ఇట్లనెను.

انا ارسلنا الیکم رسولا شاھدا علیکم کما ارسلنا الی فرعون رسولا

ఈ పోలికలో 'కమా' అను పదము సూచించబడెను. ఇదే విధంగా నూర్ అధ్యాయములో కూడ 'కమా' అనే

పదము సూచించబడెను. దీనితో స్పష్టంగా తెలియునదేమనగా మూసా పక్షములో ముహమ్మదీ పక్షములో గట్టి పోలిక గలదు. మూసా పక్షపు ఖలీఫాల పరంపర హజ్రత్ ఈసా అలైహిస్సలాం రాకతో ముగిసెను. హజ్రత్ మూసా అలైహిస్సలాం తర్వాత 14వ శతాబ్దములో ఈసా అవతరించిరి. ఈ పోలికను గమనించినచో కనీసం 14వ శతాబ్దములో ఒక ఖలీఫా మసీహ్ పోలికలతో అదే శక్తి, యుక్తులతో రావలసియుండెను. అతని మనసు, ఆచరణ ప్రకారము అతను నడుచుకోవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. గత శుక్రవారము న్యూజిల్యాండ్‌లో సంభవించిన సంఘటన గురించి కొన్ని విషయములు నేనిప్పుడు చెప్పదలచితిని. గత శుక్రవారమే చెప్పవలసి యున్నను ముగింపులో ఈ విషయము గుర్తుకు రాలేదు. కావున అనంతరం నేను ఒక పత్రికా ప్రకటన జారీ చేయించితిని. ఇందులో జమాఅత్ తరపున విచారము వ్యక్తము చేయబడెను. అనేక అమాయకులు, పిల్లలు మతము పేరున ప్రాణాలు కోల్పోయిరి, అమరులైరి. అల్లాహ్ తఆలా వారందరిని కరుణించుగాక! వారి కుటుంబీకులకు సహనము కలిగించుగాక!

ఈ సందర్భంగా కొన్ని విషయములు తర్వాత కూడ సంభవించినవి. న్యూజిల్యాండ్ ప్రభత్వము, ప్రత్యేకంగా ప్రధాన మత్రి చాలా గొప్ప రీతిలో వ్యవహరించిరి. సాటిలేని విధంగా ఆదర్శవంతగా ప్రభుత్వ హక్కులను చెల్లించిరి. ముస్లిం ప్రభుత్వములు కూడ దీనితో గుణపాఠము నేర్చుకుంటే బాగుండును. మత పరమైన ద్వేషమును అంతమొందించుటలో తమ బాధ్యతలను నిర్వర్తించుదురు గాక! అక్కడి ప్రజలు కూడ పూర్తిగా సహకరించిరి. అల్లాహ్ తఆలా వారి ఈ పుణ్యములను ఆమోదించుచు సత్యము, యదార్థమును గుర్తించుటకు వారిని అనుగ్రహించుగాక!

అక్కడ మస్జిదులలో యున్న ఒక మహిళ ఇంటర్‌వ్యూ ప్రసారమైనది. ఆమె ఆసాధారణ ఓర్పు. సహనము ప్రదర్శించెను. ఆమె భర్త, 21 సంవత్సరముల నవయువకుడైన కుమారుడు ప్రాణాలు కోల్పోయెను. వారు ప్రజలకు సహకరించుచు తమ ప్రాణాలను త్యాగము చేసిరి. ఒక పుణ్యము కొరకు, సదుద్దేశము కొరకు వారు ప్రాణాలర్పించిరి. అల్లాహ్ తఆలా వారిని కరుణించుగాక! ఇదెంతో విచారకరమైన సంఘటన. అక్కడి ముస్లిములు కూడ గొప్ప ఓర్పు, సహనము పాటించిరి. ఒక ముస్లింతో ఈ విధంగానే ఆశించబడును. ఇలాగే ఒక ముస్లిం వ్యవహరించవలెను. కాని కొందరు తీవ్రవాద వర్గములు మేము ప్రతీకారము తీసుకుంటామని ప్రకటించిరి. ఇదెంతో ఘోర తప్పిదము. ఈ విధంగా శత్రుత్వములు కొనసాగుచు పోవును. ఇస్లాంలో గల తీవ్రవాద వర్గములు కూడ అంతమగుగాక! ఇస్లాం నిజమైన, అందమైన బోధన ప్రపంచములో వ్యాపించుగాక! ముస్లిములలో అధికులే గాక అందరు ఈ కాలపు ఇమామ్‌ను స్వీకరింతురు గాక! ఫలితముగా అందరు ఏకమై ప్రపంచములో ఇస్లాం నిజమైన, అందమైన బోధనను వ్యాపింపజేయుదురు గాక!

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజుల తర్వాత నేను కొన్ని పరోక్ష అంత్యక్రియ ప్రార్థనలు కూడ చదివింతును. మొదటి జనాజ మౌలానా ఖుర్షీద్ అహ్మద్ అన్వర్ గారిది. వీరు ఖాదియాన్‌లో వకీలుల్ మాల్ తహ్రీకె జదీద్‌గా సేవలందించిరి. 19 మార్చి తేదీన 73 సంవత్సరముల వయసులో మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون అల్లాహ్ తఆలా కృపానుసారము వసియ్యత్ చేసిరి. సుదీర్ఘ కాలము నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుచుండిరి. కాని ఎంతో సహనము, ధైర్యముతో. సంకల్పముతో ఈ వ్యాధిని ఎదురించిరి. తీవ్రమైన వ్యాధి, శక్తిహీనతను లెక్క చేయకుండా తమ విధులను నిర్వర్తించుటలో ఎలాంటి నిర్లక్ష్యము వహించలేదు. క్రమం తప్పకుండా కార్యాలయానికి వచ్చేవారు. తమ సమర్పణను చివరి శ్వాస వరకు సాధ్యమైనంత రవకు గొప్పగా నిర్వహించిరి. ఇంతే గాక ఎలా హక్కు చెల్లించవలసి యుండెనో అలా చెల్లించారని నేను భావించుచున్నాను.

వారి అల్లుడు ఖాలిద్ అహ్మద్ అల్లాదీన్ ఇట్లు వ్రాసిరి. అనారోగ్య సమయమున విశ్రాంతి తీసుకోవాలని వారికి చెప్పినచో సదా వారిట్లు సమాధానమిచ్చేవారు. చివరి శ్వాస వరకు సేలందించుచు అల్లాహ్ తఆలా ఆస్థానములో హాజరు కావాలని నా కోరిక. ఈ ప్రతిజ్ఞను వారు పూర్తి చేసిరి. చాలా విధేయులు, కష్ట జీవి, నిజాయితీపరులు, ఆర్థిక విషయాలను చాలా క్షుణ్ణంగా పరిశీలించేవారు. వారిని వకీలుల్ మాల్‌గా నియమించబడినప్పుడు తహ్రీకె జదీద్ బడ్జెట్ కొన్ని లక్షలుండెను. అల్లాహ్ తఆలా కృపానుసారము ఇప్పుడది కోట్లకు పరుగెత్తినది. అల్లాహ్ తఆలా వారి

స్థాయి అంతస్థులను పెంచుగాక! వారి పుణ్యములను కొనసాగించుటకు అల్లాహ్ తఆలా వారి పిల్లలను అనుగ్రహించుగాక!

రెండవ జనాజ నాయిబ్ అమీర్ ఫిజి తాహిర్ హుసేన్ మున్షీ గారిది. 5 మార్చి తేదీన 72 సం॥ల వయసులో వీరు మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون ఫిజి జమాఅత్‌లో సుదీర్ఘ కాలము నుండి సేవలందించు చుండిరి. చాలా కాలము వరకు నాయిబ్ అమీర్‌గా సేవలందించుటకు వారు అనుగ్రహము పొందిరి. చాలా సత్యవంతులు, దుఆ చేయువారు, వినమ్రులు, విశ్వసనీయులైన వ్యక్తులు. ఖిలాఫత్ పట్ల చాలా విశ్వసనీయ సంబంధము కలిగి వుండిరి. ఖిలాఫత్ గౌరవము, విధేయత గురించి ఇతరులకు కూడ సూచించేవారు. తమ గొప్ప ఆదర్శమును కూడ ఎల్లప్పుడు చూపేవారు. ఏదేని విషయములో విభేదము ఏర్పడినచో ఆ విషయములో ఖలీఫతుల్ మసీహ్ అభిప్రాయము తెలిసినప్పుడు తక్షణమే తమ అభిప్రాయమును విడిచి పెట్టేవారు.

మూడవ జనాజ మాలీ నివాసులైన మూసా సిస్కో గారిది. 15 ఫిబ్రవరి తేదీన మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون నవంబర్ 2012 సం॥లో అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి. 2013 సం॥లో విస్కాసు నగరములో జమాఅత్ రేడియో స్టేషన్ ప్రారంభమైనప్పుడు రేడియో డైరెక్టరుగా, అదే సం॥ సదర్ జమాఅత్‌గా నియమించబడిరి. రేడియో స్టేషన్ ఏర్పాటైన తర్వాత విస్కాసు రీజన్‌లో అనూహ్యంగా వ్యతిరేకత ఎదురైనది. అప్పుడు వారు చాలా వివేకము, సహనము, ఓర్పుతో సమస్యలన్నిటిని పరిష్కరించిరి. బైఅత్ తర్వాత వారు తమను తాము జమాఅత్ పనుల కొరకు సమర్పించిరి. సామూహిక నమాజ్‌తో పాటు తహజ్జుద్ క్రమం తప్పకుండా చదివేవారు. చాలా వినమ్రులు, విశ్వసనీయమైన వ్యక్తులు. ఖిలాఫత్ పట్ల అసాధారణ ప్రేమాభిమానము కలిగి యుండిరి. ఖిలాఫత్ ద్వారా వెలువడే ప్రతి పిలుపును ఆచరించుటలో ముందుండేవారు.

అల్లాహ్ తఆలా వీరందరి స్థాయి అంతస్థులను పెంచును గాక! వారి సంతానము కూడ వారి పుణ్యములను కొనసాగించుటకు అల్లాహ్ తఆలా వారిని అనుగ్రహించుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.....................................................................

.....................................................................

.....................................................................